# ఎద్దు

గుంటకలిడిసి పాలేరోల్లు పలుగు లూడగొట్టుకొని బారెడు దొత్తెలు పగ్గాలు సుట్టుకుం ట్రాంద్రు.

పదెడ్లు మెడ లిరుసుకొని గెట్లపొంట పసక (పచ్చిక) మేసుకొంట సెలుక దాటి బీట్లెకు పొయినయ్.

అదివరకే బీట్లె రెండెడ్లు మేత్తన్నయ్... గ రెండెడ్లల్ల ఓటి కలుమతోకది. ఇంకోటి కయిలిది. గ రెండెడ్లు ఓదెలుయి. గీ పదెడ్లు యాదగిరియి.

యాదగిరి పొట్టికొమ్ముకోడె పుట్ట సిమ్మి పెడీపెడీన లెంకలేసింది.

ఓదెలు కలుమతోకెద్దు రేషానికచ్చి గుపిక్కున పొట్టికొమ్ములదాన్ని తాకింది. తొమ్మిదెడ్లు పొట్టికొమ్ముల దానికి మజ్జెతు పోయినయ్. కలుమతోకది పదెడ్లను గెదుముకుంట పొడిసింది. పదెడ్లు తోకలు మిడకొట్టి పారిపోయినయ్.

కండ్లు పులపొడుసుకుంట గెట్టుపొంట సింగులు సంకల బెట్టుకోనత్తన్న యాదగిరికి అది చూసి తల కొట్టేసినంత పనైంది. వేలకు వేలు పెట్టి కొన్న పదెడ్లు! పల్లిపిండి, ఉలువ పప్పు బత్తాలకు బత్తాలు బుక్కిన ఎడ్లు ఖదర్‌తీసేసి ఉరుకుతున్నయ్. యాదగిరి మామూలు మనిషన్న కాదు. ఆ ఊరికి సర్పంచ్... ఇగట్లచ్చింది కోపం....

"ఈటిని మాదుగుల్ దిన-పొద్గాల కోతకియ్యాలె - పదెడ్లు ఒక్కెద్దుమీద పారురుకు తన్నయ్..." పండ్లు పటపట గొరికి మీదికే అన్నడు యాదగిరి.

కలుమతోక కోడె యాదగిరి తెల్లబట్టలు చూసి బెదరింది. బుస్సు బుస్సున యాదగిరిమీది కురికచ్చింది.

"డిర్యో! నిన్ను మాదుగుల్ దిన..." యాదగిరి బండందుకున్నడు.

కలుమతోకది ఖాతరు చెయ్యలే... యాదగిరి మీద పడనేపడ్డది. సలువసేసిన ధోతంతా సింపింది. తొలి సినుకు పడి భూమి మెత్తగున్నది. కనుక యాదగిరికి కిందపడ్డా దెబ్బలేం తగులలే-గంతట్లకే ఓదెలు ఉరికచ్చి ఎద్దును గద్దరాంచి దూరంగా గొట్టిండు.

యాదగిరి అంగడంగడై లేసిండు...

అన్నిటికి మించి పాలేరోల్లు కిసకిస నవ్విండ్రు.

"ఓదిగ కండ్లు నెత్తికెక్కినయ్ బే... లంజకొడుక..." యాదగిరి తిట్టిండు.

"వసురం - బుద్ధి గానెం సెప్పినమా బాంచెన్...." ఓదెలు బతిలాడిండు.

❖ ❖ ❖

యాదగిరి యాపచెట్టు కింద కుర్సిల కూకున్నడు... అరుగుమీద కాయిదాలు ముంగటేసుకొని కారోబారు కూకుండి ఘర్‌పట్టి అసూలు సేత్తండు. యాదగిరి కెందుకో కలుమతోక కోడె కండ్లల్ల కన్పడ్తంది.... పారి ఉరుకుతున్న పదెడ్లు సుత కండ్లల్లనే కన్పడ్తన్నయ్.

కయిలు ముచ్చు బెట్టిన ఊపురం - తాటిమొదల్లోలె కాల్లు - గుమ్మోలె నడుం - గుండుకొమ్ములు - సురుకు సూపులు - బొల్లితోక నిలివెడెత్తు ఎద్దు కలుమతోక కోడె.

"నూరారయితేంది. ఆరు నూరయితేంది - కలుమతోక కోడెను కొననే కొనాలె బంచత్" అనుకున్నడు యాదగిరి.

"ఇగో ఓదెలు నాలుగేండ్ల నుంచి ఘర్ పట్టి బాకున్నవ్..." కారోబారు.

"ఏందయ్యో గాయింత గతికి లేదనుకున్నవ - కొత్తల్ లేవనుకున్నవ - సద్దమాలి కట్టలేదుగని" ఓదెలు బిర్రుకొద్ది మాట్లాడిండు.

"ఆనెద్దోలె ఆనికి కావురం బాగనే ఉన్నదేమురో! కర్సా, గంబడా? బంగారి తునకసొంటి ఎకురం పొలం - అర్రజతునక రెండుకురాల పెరడు- పెయిల నెత్తురున్నది. పిల్లా జెల్లా ఒక్కడే పోరడు - గజ్జల గుర్రమోలె పెండ్లాం - ఇగేం కర్సు" యాదగిరి మనుసుల -

"నువ్వియ్యవని కాదుర ఓదెలు, మల్ల గింతేసినవని అంటవని ముందుగాల్నే సెప్పిండు. ఓయ్! ఎంకర్రాజం ఓదెలు పైసలేడబోతయి లంగా దొంగా! సరెసరె కానియ్యి..." యాదగిరి మీదికి మేరువానుగ అన్నడు.

ఓదెలు బొచ్చెగిరి వడంగ కిసకిస నవ్విండు.

"ఓదెలూ నీ నజరు మా దండిదిరా! యాడగొన్నవో గని అవ్వల్దర్జ కోడెను గొన్నవ్. ఎంతబెట్టినవ్‌రా! లంజకొడుకుల ఎడ్ల కొనుక్కరమ్మని పైసలిత్తే తాకుడుగాల్లయి, గుడ్డేలుగు పంతయి తెత్తరు. నాకేమో ఎడ్ల మర్మం ఎరుకలేకపాయె."

ఓదెలు మొఖం కరెంటు బుగ్గోలె ఎల్గింది.

"బుగ్గారంల దెచ్చిన. ఎనిమిది నూర్లు... అడ్లమ్మి కొనుక్కచ్చిన - ఇయ్యేడు కొత్త మిగులకుంటయ్యింది. కర్సులు, గంబల్లు ఎట్లెల్లుతయో?"

"నీ తల్లి పోతేపోయినయ్. ఎనిమిది నూర్లు! ఎద్దంటె ఎద్దుగాదు...."

"ఓనీ బాంచెన్... పగ్గం నుచ్చు కొద్దె పదామడబద్దది. కాలు సప్పుడైతే పసిగడ్తది. తోకమట్ట ముట్టుకుంటే సచ్చె. దీనికందులు గాల...."

"ఏమనుకోనంటె ఇంకో నూరెక్కు విత్త, నాకియ్యరాదుర-"

"అన్న కన్ను పడనే పడ్డది. లంజకొడుక్కు" మనుసుల ఓదెలు.

"మారె ఒంటి నాగలిగాన్ని కాలాడిచ్చి పోయేటియైతేనే పనెల్తది...." తల రుమాల్ల పైకం దీసిచ్చి రశీదు తీసుకొని ఓదెలు ఎల్లిపోయిండు.

❖ ❖ ❖

యాపపుల్లతోటి పండ్లు తోముకుంట "ఊс... ఊс" అంటండు యాదగిరి. మాదుగులు తొలిసినుకు మామూల్ల గురించి సిన్నయ్య, పెద్దయ్యకు (తెలంగాణ పల్లెల్లో వర్షాకాలపు దేవుళ్లు) యాటలు కొయ్యటం గురించి సెప్పుకత్తండ్రు.

యాదగిరి మీద పిరికెడు మన్నచ్చి పడ్డది. తుపుక్కునూంచి సూసెల్లటాల్లకు ఎదురుంగ పోరడు భయపడుకుంట కనిపిచ్చిండు... యాదగిరి ఎనక ఇంకో పోరడు వక్కడ వక్కడ నవ్వుతుండు.

"కండ్లు గన్పడ్తలేవ్‌ర పోరడా! ఎవని కొడుకువురా?" యాదగిరి.

"సుద్దపెల్లి ఓదన్న కొడుకు బాంచెన్" మాదిగ పీరయ్య చెప్పిండు.

యాదగిరి పిలగాన్ని గుచ్చి గుచ్చి సూసిండు. కర్రెగ షాగె ముదిరి, సెక్కిన సంద్రకట్టె తీర్గున్నడు పోరడు... ఎందుకనో పెదవులు తెల్లగ పూసున్నయి. కడుపు నీల్ల కాగోలె పెరుగుతన్నది. కండ్లు తప్పకండ్లు. కాల్లు సన్నబడి పుల్లల తీర్గున్నయ్.

"పోరడేందిరో గట్లున్నడు?" యాదగిరి.

"బువ్వలేకనా బాంచెన్! ఒక్కడే కొడుకాయె - పోరని కగ్గిదల్గ ముద్దలకు ముద్దలు మన్నుదింటడు" పీరయ్య.

"మారే మన్ను దింటె గట్లుంటార్రా - మా పాలేరోడు ఎడ్డోడు గట్లనే తింటడు. అన్ని సూడుపో, కార్నబడితే అమురకపోవాలె."

"సెత్త తీరు బాంచెన్."

"గట్లను... సూడవోతె ఈనికి సేతాల్లం (చేతబడి మంత్రం) తాకినట్టున్నది."

"ఓదన్న కెవలు పగున్నరు బాంచెన్....?"

"పగే ఉండాన్నారా పిస్సోడా! ఇయ్యల్ల రేపు కూసంత పచ్చంగుంటెసాలు. ఆని పాలోల్లు మోరుదోపోల్లు... అందట్ల సెందురుగానికి ఇంతపెట్టుడు - తింపుడత్తది... గీపోరడు గుటుక్కుమంటె ఓదిగాని భూమి ఆల్లకయితదని నక్కెత్తులు..." యాదగిరికి కలుమత్తోక కోడె ఇంకా కండ్లల్ల కన్పడుతున్నది.

"కావొచ్చు కాలం మంచిగలేదు..." మాదుగులంతా...

ఆ మాట మాదిగి నక్కపోశడు ఓదెలు సెవులేసిండు!

"జానే గీడేమొ అంటడూ..." పెండ్లాంతోటి ఇసారం సేసిండు ఓదెలు...

"అన్నోని కల్ల ఉరుకులాడెట్ల? పనాబట్టా? తీరింది మాదిగోడ ఊరు దాటియ్యమని నాగలాపి తీరుపాటంగ ముచ్చెట బెడ్తున్నవ ఆవల అందరి నాట్లయిపోతే..." పొలంల బురద తీసి శంకరమ్మ ఒడ్డుకు కోపంగా మెత్తింది....

ఆ మాట అంతటితోటే పోయింది....

❖ ❖ ❖

కలుమతోక కోడెను యాదగిరి రోమరోమం రోజు సూత్తనే ఉన్నడు.

ఓ రోజు యాదగిరి పెరడి కాన్నుంచి రాంగ ఓదెలు బాయికాడ ఎండిపోయిన మామిడిచెట్టు కన్పిచ్చింది.

"ఆనకాలం సిగురాకులు బెట్టన్నా... ఎండిపోయిందేంది?" యాదగిరి పక్కకున్న కారోబారుకు చెప్పి తను పత్తాయించిండు.

"ఏడె (చెదలు) రోగం తాకి ఎండిపోయిందాంలె" కారోబారు.

యాదగిరి అదే కాల్లమీద ఓదెలు ఇంటిముంగటి కొచ్చి పిలిచిండు. ఓదెలు ఈతల కచ్చిండు.

"ఓదిగ జెర కానుక తిరుగు... సెవున బెడ్తలేవ్... బాయికాడి మామిడి సెట్టును సూసినావా! ఎట్లెండిపోయిందో? ఎవడో సెట్టుకు సేతాల్లం సేసిండు. ఇన్నావురా! మీ సెందురుగాడు తుక్కు మంత్రాలు నేర్సిండట... నీ కొడుకును సూసినావా?" యాదగిరి అంటిచ్చి సల్లగ ఎల్లిపోయిండు.

గ మాట శంకరమ్మ కూడ విన్నది.

ఔ ఎల్లక్కంటె మల్లక్క వాడమీది అమ్మలక్కల అరుసుకున్నది.

"కావచ్చుంటే...."

"కావచ్చు...."

ఓదెలు మాపటేలకు కొడుకుని దీసుకొని మంత్రగాన్నడుగ బోయిండు.

మంత్రకాడు అంజనమేసి పిట పిట సదివి "మనిషి కొడ షానున్నది" అన్నడు.

ఎంత్రాలు (చెట్టు వేర్లకు దారాలు చుట్టినవి) తంత్రాలు గట్టి ఇరువై రూపాయలు, కోడిపుంజు, సేరుసారా పట్టిచ్చిండు.

పిల్లగాని రోగం కుదరలే - మామిడి సెట్టుకు ఆకులు రాలే...

ఓదెలు ఎర్రిలేసినోని తీర్గ మంత్రకాల్ల సుట్టు దిరిగిండు. వాడు దండోడంటె వానికన్న మాదండోడు ఇంకొకడు...

అప్పటికి ఇన్నూరు రూపాలు, గూట్లె కోళ్లు ఒడిసినయ్. ఇంట్లయి నూరు బోంగ నూరు సేబదులు దెచ్చిండు.

ఉండుండి పోరడు బొగ్గోలె ఏర్గబట్టిండు. ఓదెలుకు సెముటలమీద సెముటలచ్చినయ్. వాడ శివసత్తిని (దేవుడు పూనకం మనిషి) తూలిచ్చిండు.

"నరుని కొడి (మనిషి చూపు) తాకింది బిడ్డా! కానక తిరుగుతున్నవ్. నా తండ్రి రాయేశునికి (రాజేశ్వరుడు) సావదీసి లింగం మీన రూపాయిబెట్టి-కోడె సల్లగుంటె కొల్లాగె (కోడె)ను కట్టేపిత్తనని మొక్కు, ఏగిరంగ ఎమలాడకు (వేములవాడ, రాజేశ్వరుడి గుడిగల ప్రదేశము) బొయిరా..." శివసత్తి చెప్పింది.

సేతుల పైసలు లేక ఆడికీడికి దిరుగంగ యాదగిరి పిలిసి అయిదు రూపాల అడ్డి రాయించుకుని ఇన్నూరిచ్చిండు. అయిబట్టుకొని పిలగాన్ని, పెండ్లాన్ని ఎంటబెట్టుకొని ఏములాడ తీర్థం బోయచ్చిండు.

మంది మాటలు బట్టుకొని మారుమనువు బోతే మల్లచ్చెటాల్లకు ఇల్లు గాలినట్టయింది.

కోతకచ్చిన వరి పొలాన్ని ఎవలో నలుసుక పోయింద్రు... మిగిలిన వరి పొలాన్ని గొడ్లు తిన్నయ్.....

"సుసినవా! ఏమయ్యిందో?" యాదగిరి ఎగేసిండు.

❖ ❖ ❖

తీర్థం బొయ్యచ్చినంక పోరడు తెల్టెగీల బడ్డడు.

మంచాల్నుంచి లేవడు–బఱ్రున పిత్తెరుగడు, పక్కున నవ్వెరుగడు. మంచం మీన్నుంచి చేతులేలాడేసి మంచంకింది మట్టిగోడను గిచ్చుక తింటడు.

పిల్లగానికి మంచిగ లేదని తెలిసి ఓదెలు అత్తమామలు వాకిట్లనుంచే ఏడ్సు కుంటచ్చింద్రు...

బిడ్డ శంకరమ్మ వాకిట్ల కెదురుబోయి షేతాల్లం తాకిందని చెప్పింది.

ముసలోడు, ముసల్ది ఇల్లెత్తెగిరి "ఎక్కన్నో దూదెకుల మంత్రగాడున్నడని" వేగిరపెట్టింద్రు.

దూదెకుల మంత్రగాడు ఓదెలు దుమ్మేకిండు. రాంగపోంగ మళ్లో ఇన్నూరు అప్పయ్యిండు. అన్నిటికి యాదగిరి దేవునోలె ఆదుకున్నడు.

దూదెకులోడు మంత్రాలు సదివి యంత్రం గట్టి "ఇంకొకటి మిగిలున్న"దన్నడు... గదేమిటో చెప్పలేదు...

ఇంటి కొచ్చేటాల్లకు కడుపుల లేగనచ్చి తొలిసూలు ఆవు సచ్చింది.

బఱ్రెపెయ్య సంధ్లకు జెలుగబట్టి ఎప్పుడో ఊసిపోయింది. మాపటించి బఱ్రెపాలు పిండిన శంకరమ్మకు పొలల్ల నెత్తురు ముద్దలు కన్పిచ్చినయ్. శంకరమ్మ భీరిపోయింది.

ఓదెలు దూదెకులోని దగ్గెరికి బోయిండు.

"నేను చెప్పలేదా? మాదెర్‌చోదు దేవతోటున్నది. పెద్దావెర (దేవత–తెలంగాణలో చాలా పెద్ద దేవత)–దాన్ని నిలుపుకో" అన్నాడు దూదెకులోడు.

పెద్దావెర గొల్సి నిల్పేటోడు దుబ్బులోడు. వాడు ఇన్నూటయాభై కర్సు చెప్పిండు.

కొలుపునాడు కొట్లాటబడ్డది.

"ఇంటావంటా లేని దేవతను తెచ్చి నిల్పుతున్నవ్. అది మంచిదేవతగాదు. సూసిందంటె పట్టుకుంటది. మా ఎంట సుత బడ్తది" ఓదెలు వదినె కములమ్మ (సెంద్రయ్య పెండ్లాం) ఝయ్యిన లేసింది.

ఈతలికొచ్చిన శంకరమ్మ కడుపుల సొద ఎల్లబోసింది... మాటలు ముదిరిపోయి – కోపాలేమొ పెరిగిపోయి – సికలకాడి కొచ్చింది వ్యవహారం – సికల్ సికల్ కొట్లాడి జుట్ల కొచ్చింది.

సెంద్రయ్య మొదటినుంచి ఖరాఖండి మనిషి. ఉచ్చిలితనమెక్కువ. మాటంటే బడితె తీత్తడు... ఓసారి యాదగిరి "బంచత్" అంటే ఓట్లప్పుడు ఆసకూసక (ఆగక) దవుడ పొంటేసిండు... ఎక్కు తక్కువంటే బొండిగే పిసికేసే రకమని యాదగిరి తప్పుక పోయిండు.

ఆఖర్న కొట్లాటల తేలిందేమంటే ఓదెలు సిరసు పగిలింది.

పంచాతు సర్పంచ్ యాదగిరి ముంగటికే వచ్చింది.

యాదగిరి సెంద్రయ్య మీది పాతపగ చొప్పున కిందామీదా తిప్పి సెంద్రయ్యకి వేయి రూపాల దండుగేసిండు.

"ఒక్క తండ్రికి బుట్టినోల్లం. తన్నుకుంటమ్ కూడుంటమ్– నువ్వెవనివి మజ్జెల?" సెంద్రయ్య అన్నాడు.

"నువ్వు నా అయ్యకే పుట్టలేదుపో!" అన్నడు ఓదెలు.

"కొట్లాట ఈడ ఫైలసలయ్యేటట్లులేదు. పోలీసు ఠానాకు పట్టియ్యకుంటె కల్సేటట్టులేద"ని యాదగిరి పెద్ద మనుషుల పంచాయతుల నుండి లేపుకపోయిండు.

సవారు బండి గట్టిచ్చుకొని నెత్తురు బట్టల ఓదెలును పోలీసుస్టేషన్‌కు తీసుక పోయిండు.

పోలీస్ స్టేషన్ల మోరీలుసాబు తప్ప (హెడ్ కానిస్టేబుల్) అమీనుసాబు (ఎస్ఐ) డ్యూటీ మీన లేడు. మోరీలుసాబుకు బిడ్డ పెండ్లికి కట్నం యియ్యంగ సిల్లరమల్లర పెట్టుబోతలు తట్టుబడ్డయ్.

"ఏం పరువలేదు ఖతల్ చేయచ్చిండని రాయి" అన్నడు యాదగిరి.

"అట్‌మ్‌ట్ టు మర్డర్... అర్థమయ్యింది. దాని కర్సు దానికున్నది. కత్తోగిత్తో దొరికినట్టుగ రాయాలె. కర్సు ఎరికేగద..." మోరీలు.

యాదగిరి జేబుల సెయ్యిబెట్టి రెండు పెద్ద నోట్లు (వంద నోట్లు) తీసిచ్చిండు.

కేసు అధాలతుల కొచ్చింది.

మున్సీసాబుకు మరేదన్న గిద్దదిగని అన్నదమ్ముల కొట్లాటంటె అగ్గిలబడ్తడు. ఎందుకంటె మున్సీసాబు సిన్నతమ్మున్ని సాది సవరిచ్చి డాక్టరు సేత్తే – వాడు మామిడి పండసొంటి పిల్లలు గిల్లలు లేని మున్సీసాబు పెండ్లాన్ని దేశంకాని దేశం లేపుక పోయిండు.

చెప్పొచ్చేదేమంటే కేసు చాలా రోజులు నడిచింది... వకీల్లు అందినకాడికి కొరుక్కున్నారు.... ఆఖరుకు సెంద్రయ్యకు మూడేండ్లు ఖైదు పడ్డది.

కేసయితె తెగిందని ఓదెలు – ఓదెలమల్లన్న (దేవుడు)కు తలార తానం జేసి బెల్లం బంచిపెడితే ఆనాటి సాయంత్రానికే పోరడు కిందామీదా చేసిండు.

యాదగిరి పిలువకుంటనే ఓదెలు ఇంటికొచ్చిండు. చెప్పకుంట సుంకరోన్ని దోలి పంబాలోన్ని (ఊరి ఉమ్మడి మంత్రగాడు) పిలిపిచ్చిండు.

పంబాలోడు ఎత్తిపోసి (మంత్రాల తతంగాలు) దించిపోసి యాట గావాలన్నడు.

యాటను దెచ్చినంక "నా సాతగాదు నాకంటె దండోడు పెట్టింద"న్నడు....

యాదగిరి పంబాలోన్ని ఓరకు బిలిసి మాట్లాడి –

“కర్సుకచ్చినపుడు ఎనక ముందాడితె కలుత్తదా! ఇన్నూటికి మాట్లాడినరా ఓదిగా...” అన్నాడు.

“నిండ మునిగినంక సలేంది బాంచెన్ కానియ్యండ్రి” ఓదెలు.

“మీ మేలు జన్మల మరిసిపోము పటేలా! దేవునోలె సాయపడ్తన్నవ్...”

శంకరమ్మ యాదగిరి కాళ్లు మొక్కింది.

“నాదేమున్నదే పిస్సదాన....” యాదగిరి లోపట లోపట నవ్వుకున్నడు. పందిరి కింద కలుమతోక కోడె పెయిమీద ఈగలు వాల్తంటే ఉలుకులికి పడ్తంది.

యాదగిరి కండ్లకింది నుంచి కోడెను సూసిండు.

పోరడు బాకున్న కాడికి కర్సులు బెట్టిచ్చుకొని సెల్లిపోయిండు.

ఏడ్చేడ్చి ఎనుకకు మర్రి సూసుకుంటె తేలింది మూడువేల అసలు, రెండు వేల వడ్డీ కలిపి అయిదు వేల అప్పు.

“బిడ్డా! ఓదెలు అప్పు కాయిదాలు ఒక్కటి సేసుకోని తిరగ రాయించుకో కట్టాలు ఎవలకైన అత్తయ్...” యాదగిరి.

ఏడాది గడిచిపోయింది. ఆయేడు వానలు పల్లేదు.

“ఉండనియ్ బిడ్డా! ఏడికి బోతయ్...” యాదగిరి.

“ఎట్లయిన సర్పంచి దేవునసొంటోడు” ఓదెలు పెండ్లాంతో నన్నడు.

ఓనాడు యాదగిరి దగ్గెర్నుంచి పిలుపచ్చింది.

ఓదెలు పోయేటాల్లకు యాదగిరి ఇంటికాడ లేడు...

యాదగిరి పెండ్లాం సావిత్రమ్మ ఓదేలుకు సుట్టలకు పోవాకుబెట్టి కూకుండబెట్టి – అసలు నంగతి ఏపముద్దకు బెల్లమతికిచ్చినట్టు చెప్పింది.

“ఇగో ఓదెన్నా, మా పెద్దెద్దు ఎనుక కచ్చింది. అయిదు నాగండ్లు నడువంగనే అందుతలేదు. ఇంకో నాగలి అందట్ల బందయితె సెయ్యిరిగినట్టే... అయినయితె కాలుకు బట్టకట్టకుంట కాలుగాలిన పిల్లోలె తిరుగుతుండు. పనుల దెవుసం కానిమోపు (కాడిమోపు పనుల రోజులు) గిప్పుడు ఎవలు ఎడ్లమ్మతరు? అమ్మినా పెద్దెద్దుమీన ఎల్లే ఎద్దు గీ సుట్టుపక్కల లేదు... మీ పటేల్ కాల్లసెప్పుదియ్యకుంట కట్టిన కచ్చుల మిడువకుంట ఊళ్లపొంట దిర్గుతండు...” ఏందో యాదికొచ్చి ఇంట్లకు బోయి ఉప్పుడు పిండి దెచ్చి పెట్టింది. తిన్నంక కట్టసుఖాలడిగింది.

“మా పెదపాలేరు ముత్తదంటడు నీ కలుమతోక కోడె మా ఎద్దు మీద ఎల్తదట – గాడన్న మోలె మీ పటేల్ అంతెత్తు ఎగిరిండు.”

“ఆదే సెక్కర్ల బడుంటె – ఆన్నే ఎద్దు నడుగుతవా” అని ‘అదిగాదని’ వాడన్నడు. “మనెద్దును ఓదన్నకిత్తాం. ఓదన్న పనెల్తది. ముల్లును ముల్లుతో దీసినట్టుగుంటది.” ‘నా పానంబోతె అడుగనన్నడు’ పటేలు. నేను గునాయించుకున్న, ఓదన్న పరాయోడా? ఏదీ పిలిసడుగుత.

ఎవల కట్టమైన ఒకటేనని ఆయినె కెరుక లేకుంట పిలిపిచ్చిన." – సావిత్రమ్మ చెప్పవల్సినవి చెప్పి ఇంట్లకు బోయింది.

ఓదెలు అటు సావిత్రమ్మ మాట తీసేయలేక ఇటు కడుపు సుమ్మర్లు సుట్టుకపోంగ లేచిపోయిండు.

శంకరమ్మ కూడండక కుమ్మండక కలుమతోక కోడెను చూచుకుంటనే కూకున్నది.

తెల్లారి యాదగిరి పైదపాలేరు ముత్తడచ్చి "కోడలచ్చినేల్ల గొడ్డచ్చినేల్ల మంచిదిగావాలె" అన్నడు.

"నిచ్చమే" అనిపించింది శంకరమ్మకు, ముత్తయ్య ఎల్లిపోయిండు.

మాపటించి ఓదెలు ఎద్దును తీస్కచ్చి యాదగిరి దొడ్లె కట్టేసి ఎనుక కచ్చిన పయ్యేద్దును పట్టుకపోయిండు.

యాదగిరికి ఆ రాత్రి నిదురబట్టక కలుమతోక కోడెను గట్టుకొని సడ్డకునింటికి సవారిబోయిండు. ముల్లానకుంట బోయిన దాన్ని ఉత్తుత్తగనే పాడిసిండు.

సావిత్రమ్మ మరల ఓదెలును పిలిపిచ్చి ఈసారి నాలుగు గారెలిచ్చింది.

"తెచ్చింది ఎనిమిది నూర్లకు. ఏడాదినర్థం సేసుకున్నవ్ – అయినెకెర్కలేకుంట నీ ఎద్దుకు ఏడు నూర్లు సూసుకో – అయిదు నూర్లు మా ఎద్దుకు సూసుకుంటం"... అని చెప్పి ఇన్నూరు ఓదెలు చేతికిచ్చి కారోబారును పిలిపిచ్చి కాయిదం రాపిచ్చి ఓదెలుతోని దస్కతు బెట్టిచ్చింది. ఏదో పంచాతుకని వచ్చిన నలుగురితోని సాక్షి సంతకాలు కూడా తీసుకున్నది.

❖ ❖ ❖

ఓదెలు ఇన్నూరు రూపాయల తోటి ఆయిటి (వర్షాకాలపు) కర్సు ఎల్లదీసుకున్నడు.

ఆ యేడు వానలైతే కురిసినయ్‌గని, ఇరాము లేకుంట కుర్సినయ్. పెచ్చెరువు సవుల్ల మీనికి నీల్లు తన్నింది. సెరువు ముంగటి ఆఖరు పొలం ఓదెలుదే – ఎకురం నాటేసిన పొలం మునిగిపోయింది.... మురిగిపోయింది.....

మక్క పెరడేసిండు గని – యాదగిరి పయ్యేద్దు మోటగడితె అడుగు తర్రబెట్టది. కిందమీదబడి ఎల్లదీత్తే రోజూ నాలుగు కాలువలు నీల్లు పారింది లేదు. ఎకురం పెరడి ఎండేపోయింది.

కర్సులు గంబల్లు పోంగా పొల్లు బుసి పోంగా మిగతా ఎకురం పెరట్లయి ఇంటికచ్చిన ఇత్తులు యాదగిరి ఆడుగకముందే వడ్డి గట్టిండు. అట్లా రెండేండ్లు తిరిగి పోయేటాల్లకు – చేసిన చేత – కాల్సిన ఇత్తీదునం పోంగ పదివేల రూపాయలు – పుట్టెడు వడ్లు, పుట్టెడు జొండ్లు ఓదెలు యాదగిరికి అప్పుదేలిండు.

❖ ❖ ❖

అదే యేడు యాదగిరికి సర్పంచ్ ఎలక్షన్లు, బిడ్డపెండ్లి, కొడుకు డాక్టరు చదువు కల్సొచ్చినయ్.

"మొసెల్ల కుంటయ్యింది..." ఓదెలు ముంగట యాదగిరి పాటికి పదిసార్లన్నడు.

సావిత్రమ్మ పిలిచి బర్రున ముక్కుసీది కట్టం సెప్పుకున్నది.

ఆడికి ఉపసర్పంచ్ రత్తయ్య ఓదెలుకు చూచాయగ చెప్పిండు.

"సుద్దపెల్లోల్ల అంశం లంగదిగాదు దొంగదిగాదు– ఆవల బిచ్చమెత్తుకున్నా ఇయ్యేడు అప్పు గట్టేత్తనన్నడు" ఓదెలు పెండ్లాంతోటి.

"గుర్రం కడుపుల గుద్దయిపోయింది బతుకు – తిన్నదిగాదు కుడిసిందిగాదు" శంకరమ్మ నెత్తినోరు కొట్టుకున్నది.

❖ ❖ ❖

"నాకే ముచ్చుగూడింది (పాడుకాలం) నిన్నెందుకు తిప్పలు బెట్టాలె – పొలమమ్ముత – పెరడమ్ముత – నాబందుకు నువ్వే ఉన్నవ్...." ఓదెలు నలుగురి ముంగట యాదగిరితో నన్నడు.

యాదగిరి నొసలు కొట్టుకొని "భూదేవర తల్లసొంటిది. దాన్నమ్ముతావురా?" అని నాలిక కొరుక్కొని ఓదెలును తిట్టిండు.

పెద్ద మనుషులు అప్పటికే ఓదెలు భూమికి ధరలు గట్టింద్రు. రాతకోతలయి పోయినంక యాదగిరి ఓదెలుకు వెయ్యి రూపాయలు ఇయ్యదేలిండు.

అప్పటికప్పుడే పైకం చేతుల బెట్టిండు యాదగిరి.

❖ ❖ ❖

పాత పగలు మర్సిపోయి కడుపుల పేగుకదలి నెత్తురు ఎదురుతిరిగి ఓదెలు జేలుకు అన్నను చూడబోయిండు.

సెంద్రయ్య తమ్మునిమీద అంతెత్తెగిరి....

"కానక సేతులు గాల్సుకున్నవ్... తప్పుక తిరుగురా తమ్ముడా అంటే నామీన్నే ఉరుకులాడినవ్... ఖరాఖండిగ మాట్లాడ్తె కట్టబోతంటివి. మన్నుదిని పోరడుంటే – రోగం తాకి మామిడి సెట్టు సత్తె – నామీనేడిసినవ్– యాదగిరిగాడు తాలుత్తాంటే (ఎక్కిస్తుంటే) తాడెత్తెగిరినవ్... చెట్టెకిచ్చి ఎక్కిచ్చి సేతులు దప్పించ్చిండు. ఎలుకల బడ్డవ్ – లంజకొడుకు నొయ్యకుంట నొయ్యకుంట అయింతోడిచ్చుకున్నడు. ఎంతపని జేసినవ్రా!"

"నాదే తప్పుగని – గయినెనంటేమున్నది?"

"కొత్త దొరలురా! కొట్టరు తిట్టరు. బెల్లం మాటలు పావురంగ మాట్లాడ్తరు. సాపకింది నీల్లతీర్గ సల్లంగ నెత్తిమీనికి పాకి గప్పుడు నెత్తిమీన కాలేసి పాతాళానికి తొక్కుతరు. గదేమాయ–గమాయల పడనోన్ని కట్టుబోతని ఇగో ఇనుప సలాకలెనుకకు పంపిత్తరు... జనం తొక్కేది ఏర్పడక – ఊబిల దిగబడిపోయి ఊపిరాడక సత్తరు. భూంపుండు ఎదురంగ కన్పిత్తెగదా తప్పుక తిరుగటాన్కి."

ఓదెలుకు అర్థమై కానట్టే ఉన్నది. ఈసారిచ్చుకుంట ఇంటికత్తె గంతే దోసింది.

.... సెరువుల నీల్లు సెరువెనుక బడ్డయి. ఎడ్లసొంటోల్లం – సర్పంజి లమ్డికొడుకు పుచ్చిన కుక్కోలె భుజం మీన బుర్ర పంచేసుకచ్చి పూరగ ఊరు కబ్జ సేసుకొని ఊడల మర్రయి పోయిండు...

శంకరమ్మ "గింత వరదనుక సమఝ్ సేసుకోలె" అని పిటపిట సదివి పండ్లు గొరికింది.

శంకరమ్మకు అమ్మంగా కండ్లపొంట నీల్లు దీసుకుంట....

బోయిన కలుమతోక కోడె – మొగడూ ఒక్కటే ననిపించింది.

❄

'ఆంధ్రజ్యోతి' వారపత్రిక – దీపావళి ప్రత్యేక సంచిక 1978